ఇంటి నుంచే ఓటు..!



ఇంటి వద్ద పోలింగ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలకుడు తుషార్ మహంతి

ప్రారంభమైన ఇంటి వద్దకే పోలింగ్..

- మిగిలిన వారికి రేపు కూడా అవకాశం
- పాలేరులో 200 మంది దరఖాస్తు
- ఐదు బృందాలు.. ఐదుగురు ప్రిసైడింగ్ అధికారులు..
- వీడియో నిఘాలో ఓటు వినియోగం

నేలకొండపల్లి: వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకునే అవకాశాన్ని ఈ సారి ఎన్నికల సంఘం కల్పించింది. ఎన్నికల విధులకు హాజరయ్యే వారికి మాత్రమే వర్తించే పోస్టల్ బ్యాలెట్‌ను ఈ సారి 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఈ అవకాశాన్ని కల్పించారు. ఈమేరకు పాలేరు నియోజకవర్గంలో 200 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 83 మంది వృద్ధులు, 117 మంది వికలాంగులు ఉన్నారు. వీరికి సోమ, మంగళవారాల్లో గడువు విధించగా.. అనివార్య కారణాల వల్ల ఓటేయని వారికి బుధవారం కూడా ఇంటికి వెళ్లి ఓటు వేయించేందుకు చర్యలు తీసుకున్నారు.

పటిష్ట భద్రత నడుమ...

ఇంటి వద్దకే పోలింగ్ కేంద్రం నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నడుమ పోలింగ్ నిర్వహించారు. పాలేరు డివిజన్ వ్యాప్తంగా మొత్తం ఐదు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ బృందంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, మైక్రో పరిశీలకులు, ప్రతీ బృందానికి వీడియోగ్రాఫర్, ఆరుగురు చొప్పున ఆర్మీ పోలీసులను కేటాయించి పటిష్ట బందోబస్తు మధ్య ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను కేంద్ర ఎన్నికల పరిశీలకుడు తుషార్ మహంతి పరిశీలించారు.

మండలాల వారీగా..

మండలం	వృద్ధులు	దివ్యాంగులు	మొత్తం
నేలకొండపల్లి	25	13	48
తిరుమలాయపాలెం	9	16	25
ఖమ్మం రూరల్	35	47	82
కూసుమంచి	14	31	45

ఇలా ఓటేయాలి..

- ఏ రోజు ఓటు వేయాలనే సమాచారాన్ని ఓటరుకు ముందుగానే తెలియజేస్తారు.
- నియోజకవర్గ నోడల్ అధికారి, డిప్యూటీ తహసీల్దార్, మైక్రో అబ్జర్వర్, వీడియోగ్రాఫర్, పోలీసులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఓటరు ఇంటికి వెళ్తారు.
- అందరి సమక్షంలో పోలింగ్ బూత్ మాదిరిగా కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసి రహస్యంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఇంటి వద్దనే ఏర్పాటు చేస్తారు. ఈ మొత్తం ఎన్నిక ప్రక్రియను వీడియోలో బంధించాలి.
- ఈ ఓటును సీల్ చేసి తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి పంపిస్తారు.
- ఇలా సేకరించిన ఓట్లను నిర్ణీత సమయానికి లెక్కింపు కేంద్రానికి తీసుకెళ్తారు.
- ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా ఓటర్లు తన ఓటును నచ్చిన వ్యక్తికి వేసేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

మొదటి రోజు 44 మంది ఓటు వినియోగం..

ఖమ్మంరూరల్: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాలేరు నియోజకవర్గంలోని వయో వృద్ధులు, దివ్యాంగులు ఇళ్ల వద్దకు వెళ్లిసోమవారంఎన్నికల అధికారులు ఓటు వేయించారు. మొదటి రోజు 44 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు తుషార్ కాంత మహంతి, ట్రైనీ కలెక్టర్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చినతండాలో ఓటు వేస్తున్న దివ్యాంగుడు

ప్రజల్లో మనసులో అభివృద్ధి నమోదైంది..



ఖమ్మంమామిళ్లగూడెం: పువ్వాడతో పలు సంఘాల నాయకులు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: ఖమ్మంలో తాను వాడవాడలా తిరిగి చేసిన అభివృద్ధి ప్రజల మనసులో నమోదైందని, రఘునాథపాలెం మండలానికి తన రెక్కల కష్టంతో ఓ స్వరూపం తీసుకొచ్చానని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని 7వ, 50వ డివిజన్లు, రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలు, నగరంలోని 50, 53 డివిజన్లలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎక్కడకు వెళ్లినా ఈ ఐదేళ్లల్లో జరిగిన అభివృద్ధి గురించే ప్రజలు మాట్లాడుకుంటున్నారన్నారు. 2014 వరకు కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఖమ్మంకు ఏమి చేశాడని ప్రశ్నించారు. సుదీర్ఘకాలం తర్వాత ఖమ్మంకు వచ్చి తన హయంలో జరిగిన అభివృద్ధి అంతా తుమ్మలే చేశానని చెప్పుకుంటున్నాడని అన్నారు. ఈ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే కారు గుర్తుపై ఓటు వేసి ఖమ్మంలో తనకు భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు. ఈక్రమంలో వేపకుంట్లలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సంఘం అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజులతో పాటు ఉప్పెర్ల వనిజాకొండలరావు, వీరునాయక్, భాస్కరరావు, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు జేఏసీ మద్దతు

ఖమ్మం మామిళ్లగూడెం: పువ్వాడ అజయ్‌కుమార్‌ను రాష్ట్ర అధికార ప్రతినిధి మడుసు జాకోబ్ ప్రతాప్, లింగాల రవికుమార్ సోమవారం కలిసి తెలంగాణ మాల మహానాడు, మాల సంఘాల జేఏసీ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర, జిల్లా నేతలు మంత్రి నరసింహయ్య, జేఏసీ చైర్మన్ చెరుకురామచందర్ వినోద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ గెలుపునకు సైకిల్ యాత్ర..

ఖమ్మం రాపర్తినగర్: పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపునకు ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సోమవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్ లో త్రీటౌన్ బీసీ సెల్ కార్యదర్శి నాగనబోయిన నాగరాజు, గుండ్ల విజయ్ భవాని తెలిపారు. కార్తీక్ కుమార్, మున్నా, నాజ్, వెంకి, రాజేశ్ పాల్గొన్నారు.

ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

కామేపల్లి: ఇల్లెందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం మండలంలోని పండితాపురం గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికి తిరిగి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు, ధనియాకుల మాధవరావు, చల్లా హరి, దొడ్డ మల్లేశ్, దండగల దేవేందర్, బానోత్ రాములు, ఐతనబోయిన విఠల్, నాగేశ్వరావు, మేకపోతుల సాయన్న తదితరులు పాల్గొన్నారు.



పండితాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

క్లుప్తంగా

ముమ్మర ప్రచారం..

అరాచక పాలన కొనసాగుతోంది..

ఖమ్మంవన్‌టౌన్: భూకబ్జాలు, పోలీసుల అక్రమ కేసులతో నగరంలో అరాచక పాలన కొనసాగుతోందని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం గుంటి మల్లన్న సత్రం పూజలు నిర్వహించాక 50, 51, రైట్ చాయిస్, ఎస్ఆర్ కన్వెన్షన్‌లో నూర్‌భాష ముస్లిం మైనార్టీ తదితర ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో పొంగులేటి ప్రసాదరెడ్డి, రాయల నాగేశ్వరరావు, మెండెం కిరణ్‌కుమార్, అమర్జహబేగ్, జ్యోతిర్మయి, తుపాకుల ఎలగొండస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓడ గుర్తుకు ఓటేయాలి..

రఘునాథపాలెం: ఓడ గుర్తుకు ఓటేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రఘునాథపాలెం మండలం వేపకుంట్లకు చెందిన గుర్రం సత్యనారాయణ వివిధ గ్రామాల్లో సోమవారం విస్తృత ప్రచారం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

ఖమ్మంమయూరిసెంటర్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనకు ఓటేసి గెలిపించాలని సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ అన్నారు. సోమవారం సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన గాంధీచౌక్‌లో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై. విక్రమ్, సీపీఎం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, బండారు రమేశ్, తుడుం ప్రవీణ్, త్రీటౌన్ నాయకులు వాజినేపల్లి శ్రీనివాసరావు, బండారు యాకయ్య, కార్పొరేటర్ వేల్లంపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి కాంగ్రెస్..

ఖమ్మంరూరల్: ఈ ఎన్నికల్లో కార్మికుల పక్షపాతి అయిన కాంగ్రెస్‌ను ఆదరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. సోమవారం ఖమ్మం, పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం మండలంలోని సత్యనారాయణపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వివిధ రంగాలకు చెందిన కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనంలో కార్మిక సంఘాల నాయకులు కొత్తా సీతారాములు, సీహెచ్. విప్లవకుమార్, గొర్రెపాటి రవీందర్, వెంకట్ పాల్గొన్నారు.

జెండాలు మార్చే వారిని ఓడించండి..

ఖమ్మంరూరల్: పార్టీ జెండాలు మార్చే వారిని ఎన్నికల్లో ఓడించాలని పాలేరు సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను వేరే జెండాలు మార్చే ప్రసక్తే లేదని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు నంద్ర ప్రసాద్, వి.సుదర్శన్‌రెడ్డి, ఎ.ఉపేందర్, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీపీఐలో పలువురి చేరిక

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెంలో పుచ్చకాయల కోటయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి సోమవారం సీపీఐ మండలాధ్యక్షుడు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు పుచ్చకాయల కృష్ణయాదవ్ సమక్షంలో సీపీఐలో చేరారు. బీఆర్ఎస్ నేతల వ్యవహార శైలీ నచ్చకే పార్టీని వీడామని తెలిపారు. పుచ్చకాయల వెంకటకృష్ణ, చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మరోమారు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా..



నేలకొండపల్లి: తిలకం దిద్దుతున్న మహిళలు



కూసుమంచి: లాల్‌సింగ్‌తండా మహిళలతో కలిసి దీపిక ప్రచారం

పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి/కూసుమంచి: పాలేరులో మారోమారు ఆశీర్వదిస్తే పాలేరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని శాసనసభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. ప్రజలు గ్రామ, గ్రామాన ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజలు తిరిగి బీఆర్ఎస్‌కు అధికారం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పాలేరులో అభివృద్ధి గురించి ఎవరైనా చర్చకు వస్తే సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు ప్రజలు తమను దీవించాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రంలో కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టాల్సిందేనని పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన వారు కందాళ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంగ్రాజుపల్లి, పైనంపల్లిలో పలు కుటుంబాలను పరామర్శించారు. మంగ్రాజుపల్లి పంచాయతీ సభ్యుడు తోళ్ల బుచ్చాలు (35) మృతి చెందగా.. కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. అలాగే కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో కందాళ విజయాన్ని కాంక్షిస్తూ.. ఆయన కుమార్తె దీపిక ఇంటింటికి బొట్టు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ శాంత, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శాఖమూరి సతీష్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గండు సతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కందాళకు ఎరుకుల సంఘం మద్దతు

ఖమ్మంరూరల్: కందాళ ఉపేందర్‌రెడ్డికి రాష్ట్ర ఎరుకుల సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూతాడి రాములు అన్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పి.కృష్ణ, కె.సత్యనారాయణ, వెంకటరమణ, కె.ముకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను ఓడిస్తాం..

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థులు అందరిని ఓడిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మానవతారాయ్ అన్నారు. సోమవారం ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చచ్చిపోయిన కాంగ్రెస్‌ను బతికించిన నాయకులను కాదని కొత్తగా వచ్చిన ఏడుగురికి టికెట్లు ఇచ్చినా తెలంగాణాలో గెలవడం కష్టమన్నారు. ప్రజాధనం మింగేందుకే ఆ పార్టీ నేతలు ఆవురావుమని ఎదురు చూస్తున్నారని, మరోమారు సీఎం కేసీఆర్ గెలవడం ఖాయమని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తొగరు భాస్కర్, దేవదానం, సత్తుపల్లి మాజీ ఎంపీటీసీ ఐ.కృష్ణ, షేక్ బాబా, యాకూబ్, బచ్చు చిన్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మానవతారాయ్

కరెంట్‌పై దుష్ప్రచారం మానుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు తప్పవని సీఎం కేసీఆర్ దుష్ప్రచారం చేయడం సరికాదని ఏపీఎస్ఐడీసీ మాజీ డైరెక్టర్, రైతు ఆత్మహత్యల నివారణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంజిరాల రాజేశ్ అన్నారు. సోమవారం ఖమ్మంలోని కస్బాబజార్ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం ఆలయానికి ఇస్తానన్న రూ.వందకోట్లు ఇవ్వకుండా భద్రాచలానికి వచ్చిన కేటీఆర్ యాదాద్రి లాగా అభివృద్ధి చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన పోలీస్ నిఘా నిర్వీర్యం కావడంతో ఆడపిల్లలు అదృశ్యమవుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘ జిల్లా నాయకులు పాండురంగా చారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

విద్యార్థినికి నాట్యచంద్రిక బిరుదు..



విద్యార్థినిని అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన నాట్య పోటీల్లో తమ విద్యార్థినికి నాట్యచంద్రిక బిరుదు లభించినట్లు విన్‌ఫీల్డ్ హైస్కూల్ డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్‌లు తెలిపారు. సోమవారం విద్యార్థిని హాసినిని అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థిని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్ పాలనలో విసిగిపోయారు..

ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య



కామేపల్లి: ప్రచార ర్యాలీలో పాల్గొన్న కోరం కనకయ్య, నాయకులు

కామేపల్లి: రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య పేర్కొన్నారు. ఈనేపథ్యాన ప్రజలంతా కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధమయ్యారని ఆయన తెలిపారు. కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం చేసిన ఆయన చేతి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని, తద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి జరుగుతుందని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, గింజల నర్సింహారెడ్డి, ఏపూరి మహేందర్, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, మద్దినేని రమేష్‌బాబు, అప్పన పిచ్చయ్య, దమ్మలపాటి సత్యనారయణ, గుజ్జర్లపూడి రాంబాబు, ఆరెం రవి, ముక్తి సాంబశివరావు, శివయ్య, లతాదేవి పాల్గొన్నారు.

పొంగులేటి గెలుపే ధ్యేయంగా సమావేశాలు..



నేలకొండపల్లి: పార్టీలో చేరిన వారితో పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి: సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

కూసుమంచి/నేలకొండపల్లి/ఖమ్మంమామిళ్లగూడెం: పాలేరు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపే ధ్యేయంగా పలు మండలాల్లో సమావేశాలు, ఇంటింటి ప్రచారాలు ఆయన కుటుంబీకులు, కార్యకర్తలు చేపట్టారు. ఈనేపథ్యాన సోమవారం కూసుమంచిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ జేఏసీ నేత శరత్ నాయక్ సమావేశం నిర్వహించారు. పలు గ్రామాల్లో ఓయూ జేఏసీ నేతలు నిరుద్యోగ యువతను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కూసుమంచిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు జర్పుల శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బునాయక్, ప్రధాన కార్యదర్శి విజయ్ నాయక్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేశ్‌రాథోడ్‌తో పాటు సెత్రాం నాయక్, ప్రవీణ్‌కుమార్, జేఏసీ నాయకులు మాట్లాడారు.

మున్నూరుకాపుల మద్దతు..

నేలకొండపల్లిలో మున్నూరు కాపులు శ్రీనివాసరెడ్డికి పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు గుండా బ్రహ్మం తెలిపగా.. మాజీ ఉప సర్పంచ్ చిన్నంశెట్టి రాంబాబు, వాకా శ్రీనాథ్, చిట్టింశెట్టి వెంకటేశ్, మర్రి శివ, ఉమస్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు, జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం డైరెక్టర్ మల్లెబోయిన శ్రీనివాసరావుతో పాటు బాలిన కోటేశ్వరరావు, హనుమంతరావు, మాతంగి రాజా, కంచర్ల వెంకటేశ్వర్లు, బేతంపూడి అనిల్, గడ్డికొప్పుల గోపి, మాతంగి ఉపేందర్ తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పొంగులేటి ప్రచార కరపత్రాలను తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు ఆధ్వర్యాన ఖమ్మంలో ఆవిష్కరించారు.

కాంగ్రెస్‌లో చేరిక..

కామేపల్లి/ఖమ్మంరూరల్: ఖమ్మంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ ఆధ్వర్యాన కామేపల్లి మండలం మద్దులపల్లి ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్‌తో పాటు జి.నారాయణరెడ్డి, జి.భద్రయ్య, బి.మంగీలాల్, ఎం.రాంమూర్తి, పాప్యానాయక్, కె.వీరబాబు, ఐ.రామనాథం, టి.కృష్ణ, ఎం.గురవయ్యలతో కలిపి 50 కుటుంబాలు, ఖమ్మంరూరల్ మండలం రేగులతండాకు చెందిన పలు బీఆర్ఎస్ కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి పొంగులేటి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. కాగా, తిరుమలాయపాలెం స్వతంత్ర అభ్యర్థి నెల్లూరి అచ్యుతరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మద్దతు పలికారు.

‘శ్రీ చైతన్య’ విద్యార్థులకు అభినందన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ముస్తఫానగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా (నేషనల్ ఏయిరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) అందించిన కిట్లను అందించినట్లు సోమవారం శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలంలు తెలిపారు. నాసా ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యా పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.